క్లుప్తంగా

ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న జగన్‌మోహన్, నటుడు సప్తగిరి

గుడిపాల: మండలంలోని కట్టకిందపల్లె దళిత వాడకు చెందిన నాగేష్ కుమారుడు నితిన్‌కు మార్ ఇంజినీరింగ్ విద్య కోసం ఆదివారం రూ.50 వేల నగదును దాతలు అందజేశారు. మండలంలోని కోలావూరు గ్రామానికి చెందిన జగన్‌మోహన్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు జగన్‌మోహన్, సినీనటుడు సప్తగిరి ప్రసాద్ రూ.50 వేల నగదును అందించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్ మాట్లాడుతూ.. పేదల విద్యాభివృద్ధికి తమ సంస్థ తరఫున సాయం చేస్తున్నామని తెలిపారు.

పంచలోహ విగ్రహాల వితరణ



పంచలోహ విగ్రహాలు అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఆధ్యాత్మిక వాతావరణంతో పల్లెలు ప్రశాంతంగా ఉంటాయని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ప్రతి పల్లెలోనూ ఆధ్యాత్మిక చింతన ఉద్దీపనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టేవారిపాలెం పంచాయతీ నలపరెడ్డిగారిపల్లె రామాలయానికి సీతారాములు సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలను వితరణ చేశారు. వాటిని ఆదివారం తుమ్మలగుంటలో ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన మహా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మోహిత్ రెడ్డి ఈ పంచలోహ విగ్రహాలను తయారు చేయించారు. ఆయన మాట్లాడుతూ, సంస్కృతీ సంప్రదాయాలకు పల్లెలు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయన్నారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంగా నిర్వహించుకునే వేడుకల్లో శ్రీరామ భజనలు, సీతారామ కల్యాణం, పట్టాభిషేకం వంటివి ఉంటాయన్నారు. నలపరెడ్డిగారిపల్లె ప్రజలు కలిసికట్టుగా రామాలయం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. సోమవారం ఆలయ ప్రారంభోత్సవానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు జెడ్పీటీసీ స్వరూప, వైఎస్సార్ సీపీ నాయకులు మనోహర్, భాను ప్రకాష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ రఘునాథ, బాలసుబ్రహ్మణ్యం, మునిరామ్ రెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా మహా కుంభాభిషేకం



కలశ ప్రతిష్ఠాపన చేస్తున్న వేదపండితులు

వెదురుకుప్పం: మండలంలోని ముసలయ్యగారిపల్లిలో వెలసిన గంగమ్మతల్లి మహా కుంభాభిషేకాన్ని ఆలయ సిబ్బంది మునిరాజులురెడ్డి, వెంకటేష్, రామ్మూర్తి ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ మహా కుంభాభిషేకంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అర్చకులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి : మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు గాండ్లవీధి (జనరల్), చిదంబరనగర్ 2,3వ వీధి (జనరల్), 28, 29 వార్డులకు చెందిన ధర్మరాజు గుడి వీధి ఉత్తరం, బజారువీధి తూర్పు (బీసీ రుబీ మహిళ), 1వ వార్డు పాండురాజుపురం, రాజీవ్‌నగర్ (జనరల్), 4వ వార్డు ఎస్‌వీ నగర్, ఎస్ఆర్ నగర్ (ఎస్సీ మహిళ), 12వ వార్డు మొదటి బీటీఎం వీధి, రాజీవ్‌గాంధీ వీధి (జనరల్), అన్నామెయిన్ రోడ్డు (జనరల్ మహిళ), మూడవ బీటీఎం వీధి (జనరల్), ఇందిరానగర్–1 (బీసీ–ఈ), 20వ వార్డు ఈశ్వరగుడి వీధి ఉత్తరం, ఎల్లమ్మ గుడి వీధి (ఎస్సీ), 18, 19వ వార్డుకు చెందిన పళ్లిపట్టు మెయిన్ రోడ్డు దక్షిణం (బీసీ మహిళ), పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి, వయసు 18 నుంచి 35లోపు ఉన్నవారు ఈ నెల 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 11, 12 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. 13వ తేదీలోపు ఎంపిక చేసిన వలంటీర్లకు సమాచారం అందుతుందని, 14వ తేదీ నుంచి బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

- జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ
- వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులు
- ముమ్మరంగా ఫీవర్ సర్వే
- గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన
- ఉచితంగా వైద్యసేవలు అందించడంతో పాటు అనునిత్యం పర్యవేక్షిస్తున్న వైద్యసిబ్బంది



గుడిపాలలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: తాగునీటి పైపులు కలుషితం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, మురుగు కుంటల్లో దోమలు వృద్ధి చెందడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే జ్వరాలతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామర్లు, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ. దీంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటి వద్దకు వైద్యసిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉండేలా కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. తద్వారా వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి..

గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు, వైద్యసిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారు. అందులో గ్రామాల్లో అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ, మండల స్థాయి అధికారులకు తెలియజేస్తూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు రోగాల బారిన పడుతున్న వారి రక్తనమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా వైద్యం అందించి, మందులు పంపిణీ చేస్తున్నారు.

నివారణ చర్యలు..

సాలమనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే టైఫాయిడ్‌తో పాటు డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని వైద్యులు చెబుతున్నారు. బ్యాక్టీరియా ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయి. వీటి నివారణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. మలేరియా నివారణ కోసం చేపడుతున్న ఫ్రైడే, డ్రైడే బహుళ ప్రయోజనాలు ఇస్తోంది. మంచి నీటి నిల్వలో పెరిగే బ్యాక్టీరియా నివారణకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో మురుగునీరు ఉన్నచోట పరిశీలించి క్లోరినేషన్ చేయిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఆహారం నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి
- మల, మూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవాలి
- ఇంటి పరిసరాల్లో టైర్లు, డ్రమ్ములు ఉంచకూడదు
- దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి
- చిన్న పిల్లలకు ఒంటిని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జాగ్రత్తలు తప్పనిసరి



“ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండురోజులకు మించి జ్వరం తగ్గకుంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలి. సాధ్యమైనంత వరకు నీళ్లు కాచుకుని తాగాలి. పీహెసీల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, యాంటి బయాటిక్స్, సెలైన్ బాటిళ్లు, పారాసిటమాల్ మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరం వస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. అన్ని గ్రామాల్లో వైద్యసిబ్బందితో పాటు వలంటీర్లు ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీల్లో రక్త నమూనాలను పరిశీలించి అవసరమైన వారికి ఉచితంగా మందులను వైద్యసిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారు. – **డాక్టర్ హరి, వైద్యాధికారి, పీహెచ్‌సీ గుడిపాల**

మసీదుకు గ్రానైట్ వితరణ



మంత్రి అందజేసిన గ్రానైట్‌ను చూపుతున్న ముస్లింలు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని జామియా మసీదుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గ్రానైట్ వితరణగా అందజేశారు. గత ఏడాది బంగారుపాళెం పర్యటనకు వచ్చిన సందర్భంగా ముస్లింల ఆహ్వానం మేరకు పెద్దిరెడ్డి జామియా మసీదును సందర్శించారు. తన సొంత నిధులతో మసీదుకు గ్రానైట్ అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మసీదుకు గ్రానైట్ అందజేసిన మంత్రికి మండల ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు దళవాయిపల్లెలో గడప గడపకు..

యాదమరి: మండలంలోని 184 గొల్లపల్లె సచివాలయ పరిధిలో ఉన్న దళవాయిపల్లె గ్రామంలో సోమవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు తదితరులు గ్రామంలో పర్యటించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్– 9849907885కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

మరో నాలుగు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో సాగుతున్న చెన్నై– బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనుల కారణంగా రోడ్ల క్రాసింగ్ లైన్ల పనుల దృష్ట్యా ఈనెల 8వ తేదీ వరకు అప్పుడప్పుడూ సంబంధిత ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని స్థానిక ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

గణనాథుని సేవలో ప్రముఖులు



ఆలయంలో జస్టిస్ సుమలత



దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వారికి ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ సురేష్, కాణిపాకం ఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

స్వర్ణరథంపై శివపుత్రుని కటాక్షం



స్వర్ణ రథంపై విహరిస్తున్న గణనాథుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆదివారం రాత్రి స్వర్ణ రథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా ఆలయంలోని ఆస్థాన మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని కొలువు తీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చి బంగారు రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి పాల్గొన్నారు.



దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన ఆలయం

కాణిపాకం ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు రోజు, సంకటహర చతుర్థి గణపతి వ్రతం కావడంతో వేల సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో కంపార్ట్‌మెంట్‌లు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయం వెలుపుల వరకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, వయో వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లిదండ్రులను ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామివారి దర్శనం కల్పించారు.



భక్తులతో నిండిపోయిన క్యూలు



స్వామివారి ఊరేగింపుగా తీసుకొస్తూ..

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం



చిత్తూరు రూరల్: ఈనెల 7వ తేదీ చిత్తూరుకు చేరుకోనున్న సీపీఐ ప్రజా బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. గురువారం సాయంత్రం 3 గంటలకు బస్సు యాత్ర చిత్తూరుకు చేరుకోనుందన్నారు. ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు గోపినాథ్, మూర్తి, సత్యమూర్తి, రఘు, దాసరి చంద్ర, విజయగౌరి, జమిలాంభి, రమాదేవి పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించండి



బోయకొండలో అభివృద్ధి పనులపై ఈఓతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై చర్యలు
- అధిక ధరలు వసూలు చేయొద్దు
- ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: బోయకొండలో సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని లేనిపక్షంలో క్రమశిక్షణాచర్యలు తప్పవని ఈఓ చంద్రమౌళి హెచ్చరించారు. ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. బోయకొండ గంగాపురంలోని అద్దె రూముల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడటం, అధిక ధరలు వసూలు చేయడంతోపాటు ప్రైవేటు రూములవారితో కుమ్మక్కై వారికి గదులు, వంట పాత్రలు అద్దెకు తీసివ్వడంపై పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరిని అక్కడ నుంచి మరొకచోటుకు బదిలీ చేశారు. అధిక రేట్లు వసూలు చేసినా, విక్రయించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆలయం వద్ద జరుగుతున్న ఈఓ గది, వాహనాల పార్కింగ్ పనులను పరిశీలించారు. వర్షానికి పుష్కరిణి పొంగి పొర్లుతుందని, పరిశుభ్రతా కార్యక్రమాలకు పూనుకోవాలని సూచించారు. బోయకొండ ఆలయం వద్ద వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన రూమును పరిశీలించారు. భక్తులకు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, లద్దూరమణ, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కుందన నృత్యాలయ నాట్య గురువు వినుత హేమంత్ ఆధ్వర్యంలో కళాకారులు మోనిక, రమ్య, జెస్సీఫర్, తనుజ, నయన, దివ్య, యశశ్విని, దర్శిని, స్నేహ పలు పాటలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రయాణికులతో గౌరవంగా నడుచుకోండి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా వ్యవహరించడం, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో నిలపడంలేదని డ్రైవర్లపై ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. రిక్వెస్ట్ స్టాపింగ్ విషయంలో డ్రైవర్లు ప్రయాణికులతో సహకరించాలని తెలిపారు. ప్రయాణికులకు ఆర్టీసీపై గౌరవం పెరిగేలా ఉద్యోగులు నడుచుకోవాలని సూచించారు.

జల కళ



గువ్వకల్లు వంక వద్ద చేపలు పడుతున్న చిన్నారులు, పెద్దలు

చిత్తూరు మండలంలో ఆదివారం వేకువజామున భారీ వర్షం కురిసింది. వంకలు పొంగిపొర్లాయి. కాలువల నుంచి చెరువులకు వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చేపలు సైతం కొట్టుకొస్తున్నాయి. చేపలు పట్టేందుకు పెద్దల నుంచి చిన్నపిల్లల వరకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వంకలు, చెరువుల కట్టల వద్ద సందడిగా కనిపిస్తోంది. - చిత్తూరు రూరల్



తాళంబేడు వంకలో వర్షపునీరు